క్లుప్తంగా

పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన


పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సుప్రభాతరావు

రామాయంపేట(మెదక్): భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని మరో 25 ఏళ్లపాటు పట్టణంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు పేర్కొన్నారు. పట్టణంలోని మంజీరా స్కూలు వద్ద శుక్రవారం పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో గతంలో వేసిన పైప్‌లైన్ పాక్షికంగా ధ్వంసం కావడంతో అవసరమైన ప్రదేశాల్లో కొత్తగా పైప్‌లైన్ వేస్తున్నామని తెలిపారు. ట్యాంకుల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

అల్లాదుర్గం(మెదక్): ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద మొక్కలు నాటాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా గడిపెద్దాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు రావన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, కార్యదర్శి రాములు తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్డుతో రాకపోకలకు ఇబ్బందులు



నర్సాపూర్‌రూరల్: పట్టణంలో 6వ వార్డులోని ఖాజీగల్లీలో రోడ్డు, మురికి కాల్వ ధ్వంసం కావడంతో 5వ, 6వ వార్డుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాజీగల్లీ ప్రజలు నిరంతరం నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల మార్కెట్‌కు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రోడ్డు వెంట రాకపోకలు కొనసాగిస్తుంటారు. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, కార్లు అసలే వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే ఈ రోడ్డుతో పాటు మురికి కాల్వకు మరమ్మతులు చేపట్టాలని ఖాజీగల్లీ ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా మారిన ద్యుత్ తీగలు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం హకింపేట గ్రామ శివారులోని సీసీ రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు రోడ్డుకు సమీపంలో, తక్కువ ఎత్తులో ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదం సంభవించి ప్రాణనష్టం సంభవించక ముందే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాలలో పర్యటించాలి

తూప్రాన్ సీఐ రంగాకృష్ణ



మనోహరాబాద్(తూప్రాన్): స్థానిక ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో పర్యటించాలని, ప్రాపర్టీ కేసులు చేయించాలని తూప్రాన్ సీఐ రంగాకృష్ణ పోలీసులకు సూచించారు. శుక్రవారం మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, ఎస్ఐ సుభాష్‌గౌడ్‌కు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు రోల్‌కాల్ నిర్వహించాలని, విచారణ జరగని, గుర్తించని కేసులు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఉన్నవాటికి మరమ్మతులు చేయించాలన్నారు.

వంతెన నిర్మాణం ఇంకెన్నాళ్లు..?

- గుంతల మయంగా రోడ్లు
- పల్టీలు కొడుతున్న వాహనాలు
- కలగా రేగోడ్–మర్పల్లి బ్రిడ్జి


రేగోడ్–మర్పల్లి రోడ్డు దుస్థితి.

రేగోడ్(మెదక్): రేగోడ్–మర్పల్లి వంతెన నిర్మాణం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రెండు లేన్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేసినా కల్వర్టును మాత్రం నిర్మించడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో ఓ పక్క గుంతలమయం, మరోవైపు రోడ్డు ఎత్తుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వంతెన నిర్మాణం ఎన్నాళ్లు..? అని ప్రశ్నిస్తున్నారు. పెద్దశంకరంపేట–రేగోడ్, పోచారం వరకు సుమారు రూ.16 కోట్ల వ్యయంతో రెండు లేన్ల రోడ్డు నిర్మించారు. రేగోడ్–మర్పల్లి మధ్యలో ఓ కల్వర్టు నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దాంతో కొన్నేళ్లుగా కల్వర్టు లేక రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోచారం నుంచి రేగోడ్ వెళ్తున్న ఆటోలు ఎత్తుగా ఉన్న రోడ్డు ఎక్కలేక పలుమార్లు పల్టీలు కొట్టిన సందర్భాలు లేకపోలేవు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక పోలీసులు మొరం వేయించి ప్రయాణికుల అవస్థలు కొంత మేరకు తీర్చినా.. మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని చెబుతున్నా.. పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రం నుంచి మరో మండల కేంద్రం, హైవేలకు లింకు కలుపుతూ రెండు లేన్ల రోడ్లు నిర్మిస్తున్నా.. ఇక్కడ మాత్రం నోచుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఏ గ్రామమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు బాగుండాలి.. అప్పుడే రవాణా సౌకర్యం మెరుగుపడి గ్రామాలతో పాటు ప్రజలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

రేగోడ్–మర్పల్లి మధ్యలో వంతెన నిర్మాణానికి రెండు నెలల క్రితమే సుమారు రూ.1 కోటి నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– విజయ్, పీఆర్‌ఏఈ

ఆ టీచర్ల డిప్యూటేషన్లు నిలిపివేయాలి

పాఠశాల గేటు ఎదుట గ్రామస్తుల నిరసన


నందగోకుల్‌లో పాఠశాల గేటు ఎదుట గ్రామస్తుల నిరసన

నిజాంపేట(మెదక్): ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోకి పంపిస్తే డిప్యూటేషన్ పేరిట ఉపాధ్యాయులను బదిలీ చేయడం సరి కాదని స్థానికులు ఆందోళనకు దిగారు. శుక్రవారం నిజాంపేట మండలం నందగోకుల్‌లో ప్రభుత్వ పాఠశాలలో 55 మంది విద్యార్థులకు గాను నలుగురు టీచర్లు ఉండగా.. డిప్యూటేషన్ పేరిట ఇద్దరూ ఉపాధ్యాయులను వేరొక ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. మన ఊరు మన బడి అనే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తర్వాత ఉపాధ్యాయులను బదిలీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధ్యాయులను బదిలీ చేస్తే విద్యార్థుల చదువులు నాశనం చేసినట్లు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ షయమై గేటు ఎదుట గంట పాటు నిరసన తెలిపారు. డిప్యూటేషన్ వెంటనే నిలిపివేయకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళతానని మండల విద్యాధికారి సాంగాని యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో బుర్ర సంతోష్ గౌడ్, అందే సిద్ధ రాములు, మ్యాదరి కుమార్, భూపతి రెడ్డి, బురాని నర్సాగౌడ్, నాగభూషణం తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

అటవీ రేంజ్ అధికారి అంబర్ సింగ్


వడియారం అడవిలో మొక్కలు నాటుతున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం అటవీ ప్రాంతంలో శుక్రవారం హరితవనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులు అడవిలో మొక్కలను నాటారు. అటవీ రేంజ్ అధికారి అంబర్ సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హరితవనం కార్యక్రమంలో మొక్కలను నాటి వాటిని రక్షించాలని, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలని కోరారు. అడవులను కాపాడుకోవడంతో కోతుల బెడదను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, డీఆర్వో చంద్రశేఖర్, సెక్షన్ ఆఫీసర్లు కిరణ్ కుమార్, భూపతి, కలీం, బీట్ ఆఫీసర్లు రవికుమార్, భరత్, ఖైరున్నీసా, స్నేహలత, మమత, రజని, రెవెన్యూ సిబ్బంది, దీప్తి విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్


మాట్లాడుతున్న శంకర్

చేగుంట(తూప్రాన్): స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించి బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చేగుంట, నార్సింగి మండలాల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి రుణమాఫీ, గ్యాస్‌సబ్సిడీ, మహిళ పింఛన్లు, రాజీవ్ యువశక్తి వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉదన్నారు. అనంతరం చేగుంట–మెదక్ రోడ్డులో రైల్వే వంతెన మంజూరు చేయించిన ఎంపీ రఘునందన్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సమావేశంలో పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, స్థానిక ఎన్నికల ఇన్‌చార్జి కనకయ్య, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, భూపాల్ మహిళ నాయకులు సుజాత, జ్యోతి, లావణ్య పాల్గొన్నారు.

పుస్తకాలనే కాదు.. నేలనూ చదువుతాం

- వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు
- క్షేత్రస్థాయిలో పంట సాగు పరిశీలన


శీలాంపల్లిలో పత్తిని పరిశీలిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వ్యవసాయానికి సంబంధించిన పుస్తకాలను చదవడం కన్నా.. క్షేత్రస్థాయిలో పంటసాగును పరిశీలిస్తే వచ్చే అనుభవం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మల్లారెడ్డి యూనివర్శిటీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. శుక్రవారం వారు కేవీకే శాస్త్రవేత్త డా, రవికుమార్ ఆధ్వర్యంలో చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లి గ్రామంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు పత్తి సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పత్తి సాగులో గుర్తించిన, చీడ పీడలకు నీమ్‌ఆయిల్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు లలితాశ్రీ, చందన, అటయ. అశ్వనీ, భావన, భవానీ, శేశ్విక పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఎమ్మెల్యే హరీశ్‌రావు
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



చిన్నశంకరంపేట(మెదక్): రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మడూర్ సొసైటీ వైస్ చైర్మన్ బీమరి యాదగిరి (టీ.మాందాపూర్), పీఏసీఎస్ డైరెక్టర్లు విఠల్‌నాయక్ (మిర్జాపల్లి), శ్రీశైలం (శాలిపేట) బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ఆధ్వర్యంలో హైదారాబాద్‌లో హరీష్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు, ఐదు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చినప్పటికి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన పనులను, 18 నెలల్లో కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పట్లోరి రాజు, మడూర్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, నాయకులు సుధాకర్, రమేష్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామ స్వరాజ్యం

మనోహరాబాద్(తూప్రాన్): బీజేపీతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు భైరి శంకరి అన్నారు. శుక్రవారం మనోహరాబాద్‌లో మండల బీజేపీ అధ్యక్షుడు బక్క వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని, గ్రామాలలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. బీజేపీ నాయకులు మల్లేష్, కనకయ్య, రామ్మోహన్‌గౌడ్, మండల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దు

- ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు
- ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు

నర్సాపూర్ రూరల్: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని ఆపరేషన్ ముస్కాన్ 11వ టీం సభ్యులు వ్యాపార సంస్థల యజమానులను హెచ్చరించారు. శుక్రవారం నర్సాపూర్‌లో ఆపరేషన్ ముస్కాన్ 11 టీమ్ సభ్యులు ఆకస్మికంగా పలు వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేశారు. నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న అజీమియా పూల దుకాణం యజమాని షకీల్ అనే వ్యాపారి షాబాజ్ ఖాన్ 16 ఏళ్ల వయసు ఉన్న బాల కార్మికుడిని పనిలో పెట్టుకుని పని చేయించడంతో యజమాని షకీల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీంతోపాటు నర్సాపూర్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న సుంద గ్రాండ్ బట్టల షాపు యజమాని ఉమేష్ దేవసి అనే వ్యాపారి పప్పు దేవసి అనే 17 ఏళ్ల వయసు ఉన్న బాల కార్మికుని పనిలో పెట్టుకొని పనులు చేయించడాని గుర్తించి యజమాని ఉమేష్ దేవసిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పై ఇద్దరి వ్యాపారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆపరేషన్ ముస్కాన్ టీం ఎస్సై జగన్నాథం తో పాటు ఇతర టీం సభ్యులు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ తనిఖీ లు ముమ్మరంగా చేపట్టనున్నట్లు చెప్పారు. వ్యాపారులతో పాటు పిల్లల తల్లిదండ్రులు 18 ఏళ్లు దాటని వారిని పనిలో పెట్టకుండా చదివించాలని సూచించారు.

వీడని ముసురు

పెద్దశంకరంపేట(మెదక్): రెండు రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ముసురు ఏర్పడింది. భారీ వర్షాలు కురిస్తే తప్ప చెరువులలో నీరు చేరే పరిస్థితి లేదు. ఈ వర్షానికి ఆరుతడి పంటలకు కొంత మేర లబ్ధి చేకూరింది. దీంతో ఆయా గ్రామాలలో రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు.

పెసర పంట పరిశీలన


కమలాపూర్‌లో పెసర పంటను పరిశీలిస్తున్న ఏఓ

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కమలాపూర్ తదితర గ్రామాలలో పెసర పంటను ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణ శుక్రవారం పరిశీలించారు. గతంలో రైతులకు క్వాలిటీ సీడ్స్ ఇన్ ఎవ్రీ విలేజ్ ప్రోగ్రాం ద్వారా పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఈ పంట ఎదిగే దశలో ఉంది. పంట పండించిన తర్వాత ఈ విత్తనాలను తిరిగి విత్తనాలుగా వాడుకునే అవకాశం ఉందని, రసం పీల్చే పురుగు నివారణ కోసం ఏఓ తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఈఓలు వినీత్, అఖిల్, రైతు కిషన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన అవసరం

ఎస్ఐ రాజేష్


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిదిలోని రాంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సైబర్ సెక్యూరిటీ ,డ్రగ్స్‌పై ఎస్ఐ రాజేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. అమ్మాయిలు ఏదైనా సమస్యతో బాధ పడితే ముందుగా తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు లేదా స్నేహితులకు చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలని, ఎలాంటి సమస్యలు సందేహాలు ఉన్న 112 నంబర్ కు డయల్ చేసినచో కావాల్సిన సాయం అందుతున్నారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మారెడ్డి, పరశురాములు, మాజీ కోఆప్షన్ సభ్యుడు గౌస్, ఇందిర, గ్రామ కార్యదర్శి చంద్రహాస్, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం మార్పు

సాక్షి ఎఫెక్ట్..


కూకుట్లపల్లి అంగన్‌వాడీని పరిశీలిస్తున్న సీడీపీఓ హేమభార్గవి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని కూకుట్లపల్లిలో కురుస్తున్న వర్షాలకు పెచ్చులూడిన అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో అద్దెకు ఉంటున్న భవనం శిథిలమవడంతో పాటు, కురుస్తున్న వర్షాలకు పెచ్చులూడిపోవడంతో, చిన్నారులతో పాటు, సిబ్బందిని సైతం ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని, దాంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామ పంచాయతీ భవనంలోకి మార్చామని తెలిపారు. అందుకుగానూ గ్రామ పెద్దలు అంగీకారం తెలిపారన్నారు. త్వరలోనే గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మించేలా తగిన చర్యలు తీసుకంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆశ, మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమర్ సుల్తానా, అంగన్‌వాడీ టీచర్ సద్గుణ, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరనున్న శారదాంబ మాత


బగలాముఖీ శక్తిపీఠంలో నిర్మితమైన ఆలయం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో నిర్మితమైన బగలాముఖీ శక్తిపీఠంలో మరో మందిర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వేద పండితుడు, బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ సొంత నిధులు రూ.30 లక్షలతో శారదాంబ మాత ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. శృంగేరి జగద్గురు ఆశీస్సులతో జగదాంబ ఆలయ నిర్మాణానికి పూనుకోగా పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

దాత సమకూర్చిన విగ్రహం

ఆలయంలో ప్రతిష్ఠించేందుకుగాను శారదాంబ పంచలోహ విగ్రహాన్ని సమకూర్చేందుకు శివ్వంపేటకు చెందిన మాజీ జెడ్పీటీసీ మహేష్‌గుప్తా ముందుకు వచ్చారు. నాలుగున్నర లక్షల నిధులతో ఈ విగ్రహాన్ని శుక్రవారం శక్తిపీఠంకు తీసుకొచ్చారు. శృంగేరి జగద్గురు ముహూర్తం నిర్ణయించి శారదాంబ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లు వేదపండితుడు వెంకటేశ్వర శర్మ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కొల్చారం(నర్సాపూర్): పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మండలంలో సీఎంఆర్ఎఫ్ కింద విడుదలైన రూ.4.88 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, ఆ పార్టీ నాయకులు వెంకట్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీశైలం, శేఖర్ పాల్గొన్నారు.

◆ మార్కెట్‌కు అనుగుణంగా డబ్బులు తీసుకోవాలి

శివంపేట(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్ సిమెంట్, బ్రిక్ ,స్టీల్, కంకర, ఇసుక మార్కెట్ ధరలకు అనుగుణంగా తీసుకోవాలని తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సిమెంట్, స్టీల్ డీలర్లు, మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అధిక ధరలు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. కమిటీ ద్వారా ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

◆ మినీ ఆర్వో వాటర్ ప్లాంట్ అందచేత

నర్సాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల తాగు నీటి సమస్య తీర్చాలన్న ఉద్దేశంతో మినీ ఆర్వో వాటర్ ప్లాంట్ అందచేసినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం తనకు ముఖ్యమని, ప్రభుత్వంపై ఆధారపడకుండా తన సొంత నిధులతో ప్లాంటు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లెక్చరర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, పార్టీ నాయకులు రిజ్వాన్, నగేష్, వెంకట్రాంరెడ్డి, అశోక్, రవి, నరేందర్‌రెడ్డి, హబీబ్‌కాన్, సుధీర్‌గౌడ్, పాల్గొన్నారు.

◆ సీసీ కెమెరాలు అందజేత

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి పోలీసులకు బీఆర్ఎస్ నాయకుడు రూ. 60వేల విలువ గల సీసీ కెమెరాలను శుక్రవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్ సమక్షంలో అందజేశాడు. కార్యక్రమంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రేగోడ్(మెదక్): ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్ఐ ఫెరోజ్ కోరారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, పురాతన గృహాలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు.

◆ శ్రీ వాసవీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీవాసవీ మాత ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా లలిత సహస్రనామాలు, అష్టలక్ష్మి స్తోత్రాలు జపించారు.

◆ పింఛన్లు వెంటనే పెంచాలి

అల్లాదుర్గం(మెదక్): దివ్యాంగులు, వృద్ధులు, వితంతుల పింఛన్లు వెంటనే పెంచాలని ఎమ్మార్పీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ:4 వేలు, వృద్ధులు వితంతులకు రూ:3 వేలు పింఛన్ అమలు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేటికీ అమలు కావడం లేదన్నారు. ఆగస్టు 6లోగా ప్రభుత్వం అమలు చేయకుంటే , 13న ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో వికలాంగుల మహాగర్జన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ గర్జనకు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో అశోక్ , నర్సింలు, మచ్చేందర్, మోహన్ రాథోడ్, తుకారం, కిష్టయ్య, దుర్గయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

కౌడిపల్లి(నర్సాపూర్): ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని లీవ్‌పామ్ ప్రతినిధులు మౌనిక, అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాయిలాపూర్‌లో రైతు నర్సింగరావు సాగు చేస్తున్న 15 ఎకరాల ఆయిల్ ఫామ్‌ను పరిశీలించి, తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో మంచి ఆదాయం లభిస్తుందని, తక్కువ ఖర్చుతో, ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. పైగా ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

◆ నషా ముక్త్ భారత్‌లో విద్యార్థుల ప్రతిభ

పాపన్నపేట(మెదక్): నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో పాపన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ నర్సింలు తెలిపారు. స్టూడెంట్ కౌన్సిలర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నషా ముక్త్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారని చెప్పారు. లెక్చరర్ ఫిర్‌దౌస్ వారికి బహుమతులు అందజేశారు.

◆ ఇటుక ట్రాక్టర్లకు జరిమాన

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజీపేట శివారులో అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహించడంతో పాటు అక్రమంగా ఇటుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని జరిమాన విధించినట్లు మైనింగ్ జిల్లా ఆర్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేట శివారులో మూడు ట్రాక్టర్లను పట్టుకుని రూ.20 వేల చొప్పున జరిమాన విధించినట్లు తెలిపారు. అనుమతులులేని ఇటుక బట్టీలపై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

◆ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

తూప్రాన్: స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని బీజేపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు భైరి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్లాంపూర్ బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పిట్ల పోచయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థ ఎన్నికల కన్వీనర్ కనకయ్య, రాంరెడ్డి, మల్లేష్, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, శ్రీనివాస్ రెడ్డి, తూప్రాన్ మండల మాజీ అధ్యక్షులు సిద్దిరాములు, తూప్రాన్ మండల బీజేపీ జనరల్ సెక్రటరీ అంబటి మహేష్, పిట్ల శేఖర్, చుక్క రాము, శక్తి కేంద్రం ఇంచార్జ్ రాజు, సందీప్, నర్సింలు, నర్సింలు, సీత నరేష్ తదితరులు పాల్గొన్నారు.